సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు

ముదిరాజ్‌లను బీసీ ఏ గ్రూపులోకి మార్చాలి

తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు ముదిరాజ్

కొడంగల్, అక్టోబర్ 19 : ముదిరాజ్‌లను బీసీ డి గ్రూపు నుంచి బీసీ ఏ గ్రూపులోకి మార్చాలని, గతంలో ఇచ్చిన జీవో ఎంఎస్ నం.15 అమలుతో పాటు పలు డిమాండ్‌లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు ముదిరాజ్ తెలిపారు. శనివారం ముదిరాజ్‌ల ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఆనాటి మాజీ సీఎం రాజశేఖర్‌రెడ్డి ముదిరాజ్‌ల డిమాండ్‌లు న్యాయపరమైనవిగా గుర్తించి, ముదిరాజ్‌ల జీవన పరిస్థితులను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన ఆనాటి బీసీ కమీషన్ చైర్మన్ దాల్వా సుబ్రమణ్యం ఇచ్చిన నివేదిక ఆధారంగా ముదిరాజ్‌లను బీసీ డి గ్రూపు నుంచి బీసీ ఏ గ్రూపులో మార్చేలా జీవో నం.15 జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఆయా కారణాల కారణంగా సుప్రీంకోర్టులో కేసు వేశారని.. 11అక్టోబర్2022న ముదిరాజ్‌లను బీసీ ఏ నుంచి మార్చే విషయం తెలంగాణ, ఏపీ ప్రభుత్వాల బీసీ కమిషన్‌ల ద్వారా పరిష్కరించాలని కోర్టు ఆదేశించినట్లు తెలిపారు. కోర్టు తీర్పు వెలువడి రెండు సంవత్సరాలు అవుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. గ్రూప్ డి కారణంగా టీపీఎస్ ద్వారా భర్తీ చేసిన ఉద్యోగాల్లో ముదిరాజ్‌లకు ఒక్క శాతం ఉద్యోగాలు కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వమైనా ముదిరాజ్‌ల సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు.

ముదిరాజ్‌లకు రూ.5వేలకోట్ల ప్రత్యేక ఆర్థిక సంస్థ ఏర్పాటు చేయాలని, మంత్రి పదవితో పాటు జనాభా ప్రాతిపదికన ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, చైర్మన్ నామినేటేడ్ పదవులను ఇవ్వాలన్నారు. చెరువులు, కుంటలపై పూర్తి హక్కులను కల్పించాలని, ముదిరాజ్‌లపై దాడులు చేసిన, చెరువుల్లో చేపలను లూటీ చేసిన వారిని పీడీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం దౌల్తాబాద్ మండలానికి చెందిన కూర వెంకటయ్యను స్టేట్ జాయింట్ సెక్రటరీగా ఎన్నుకుంటూ నియామకపత్రాన్ని అందజేశారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

షాద్‌నగర్‌టౌన్, అక్టోబర్ 19 : షాద్‌నగర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఖాళీగా ఉన్న 9 సీట్లకుగాను అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 30వరకు https://iti.telangana.gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపు జాబ్ మేళా

వికారాబాద్, అక్టోబర్ 19 : వికారాబాద్ ప్రభుత్వ పారిశ్రామిక సంస్థ ఐటీఐలో అక్టోబర్ 21న ఉదయం 10 గంటలకు ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేళా/జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ నరేంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో లోకేశ్ ఇండస్ట్రీస్, తోషిబా, లక్ష్మీ హ్యూండయ్, వెల్‌స్పన్ ఇండస్ట్రీస్, కార్తికేయ ఇండస్ట్రీస్, పెన్నార్ ఇండస్ట్రీస్, జాన్సన్ లిఫ్ట్ తదితర కంపెనీలు పాల్గొంటాయన్నారు. మేళాకు వచ్చేవారు పదో తరగతి, ఐటీఐ/డిప్లొమా మార్క్స్ మెమో, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్‌తో పాటు పూర్తి వివరాలతో కూడిన బయోడేటా ఫారాన్ని తీసుకొని రావాలన్నారు. మరింత సమాచారం కోసం 9177472488ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనం వద్ద సీహెచ్‌సీకి చెందిన చిన్న ట్రాక్టర్‌పై కోతి కూర్చొని డ్రైవింగ్ చేస్తున్నట్లుగా యాక్షన్ చేయడంతో అక్కడ ఉన్న సిబ్బంది, మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ దృశ్యాన్ని తమ సెల్‌ఫోన్‌లలో బంధించారు.
- కులకచర్ల, అక్టోబర్ 19

మారనున్న తాండూరు మున్సిపల్ స్వరూపం

- మాస్టర్ ప్లాన్-2050
- 26 నుంచి మున్సిపల్ పరిధిలో డిజిటల్ సర్వే
- మున్సిపల్ అధికారులు, నేతల సమీక్షలో మున్సిపల్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ నర్సింహారెడ్డి

మున్సిపల్‌లో చైర్‌పర్సన్ స్వప్న, కమిషనర్ విక్రంసింహారెడ్డితో సమీక్ష చేస్తున్న నర్సింహారెడ్డి

తాండూరు, అక్టోబర్ 19 : వికారాబాద్ జిల్లాలోని తాండూరు మున్సిపల్ స్వరూపాన్ని మార్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. శనివారం తాండూరు మున్సిపల్‌లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు 25 సంవత్సరాలకు సరిపడా వసతులపై మున్సిపల్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ నర్సింహారెడ్డి చైర్‌పర్సన్ స్వప్న, కమిషనర్ విక్రంసింహారెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష చేశారు. మాస్టర్ ప్లాన్ అమలు కోసం సర్వే ఆఫ్ ఇండియా, డీటీపీవో అధికారుల పర్యవేక్షణలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 26 నుంచి మున్సిపల్ పరిధిలో డిజిటల్ సర్వేకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. ఆరు నెలల్లో ప్రక్రియను పూర్తి చేస్తామని వెల్లడించారు. మాస్టర్ ప్లాన్ అయ్యాక తాండూరు రూపురేఖలు మారుతాయన్నారు. దీంతో తాండూరు మరింత అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. అనంతరం తాండూరు మున్సిపల్ పరిధిలో ఉన్న వివిధ అక్రమ నిర్మాణాలు, కట్టడాలను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను కూల్చివేస్తామని చెప్పారు. ప్రజలు నిర్మాణాలు చేపట్టేప్పుడు పూర్తి స్థాయిలో అన్ని విషయాలను తెలుసుకోవడంతో పాటు మున్సిపల్ పర్మిషన్ కచ్చితంగా తీసుకోవాలన్నారు. అక్రమాలకు పాల్పడినవారు ఎంతటి వారైనా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం, వ్యవసాయాధికారులు

మొక్కజొన్న పంట పరిశీలన

వికారాబాద్, అక్టోబర్ 19 : మోమిన్‌పేట మండలం ఎన్కేపల్లి గ్రామానికి చెందిన రైతు దంగేరి నర్సింహులు కావేరి కంపెనీకి చెందిన ఎక్క-2288 మొక్కజొన్న పంటలో బహు కంకులు (రెండు కంటే ఎక్కువ కంకులు) రావడంతో రాజేంద్రనగర్ మొక్కజొన్న పరిశోధనా కేంద్రం నుంచి శాస్త్రవేత్తల బృందం, వ్యవసాయశాఖ అధికారులు రైతు క్షేత్రాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తల బృందం చైర్మన్ డాక్టర్ బద్రు, ప్రిన్సిపల్ సైంటిస్ట్(ప్లాంట్ బ్రీడింగ్) మాట్లాడుతూ.. మొక్కజొన్న పంట బెట్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఒత్తిడికి గురై లేదా మొక్కల సాంద్రత తక్కువ అయినప్పుడు మొక్కలు ఎక్కువ బలాన్ని తీసుకుని అధిక కంకులు(కండెలు) వస్తాయని తెలిపారు. మొక్కకు అధిక కంకులు వచ్చినప్పటికీ రైతు మంచి ఎరువులు, పురుగుమందుల యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల అధిక నష్టానికి గురికాకుండా పంటను కాపాడగలిగాడని శాస్త్రవేత్తలు రైతును ప్రశంసించారు. పరిశీలించిన రిపోర్టును త్వరలోనే దక్షిణ తెలంగాణ జోన్‌కు చెందిన ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం, పాలెం వారికి., ప్రభుత్వానికి నివేదిస్తామని వివరించారు. కార్యక్రమంలో సీనియర్ సైంటిస్ట్(ప్లాంట్ పెథాలజీ) మల్లయ్య, మండల వ్యవసాయ అధికారి భూపతి జయశంకర్, వ్యవసాయ విస్తరణ అధికారి బీకే శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్లను అభివృద్ధి చేసుకోవాలి

- శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకమండలి ప్రమాణ స్వీకారం



సమావేశంలో మాట్లాడుతున్న శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

చేవెళ్లటౌన్, అక్టోబర్ 19 : వ్యవసాయ మార్కెట్లను నూతన చైర్మన్లు అభివృద్ధి చేసుకోవాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. శనివారం చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్‌లో ఎమ్మెల్యే కాలె యాదయ్య అధ్యక్ష తన చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి స్పీకర్, పాల్యూషన్ బోర్డు మెంబర్ సత్యనారాయణరెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీకి కావాల్సిన సదుపాయాలు గోదాంలు, కోల్డ్ స్టోరేజీలకు ప్రపోజల్ తయారుచేసి పంపిస్తే వ్యవసాయ మంత్రితో మాట్లాడి తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. చేవెళ్ల-బీజాపూర్ రోడ్డు మంజూరైందన్నారు. మన్నెగూడ నుంచి తాండూరు వరకు కూడా రోడ్డు పనులకు ప్రపోజల్ ఇవ్వడం జరిగిందన్నారు. కొంగరకలాన్‌లో ఉన్న రంగారెడ్డి కలెక్టరేట్‌ను రాజేంద్రనగర్‌కు తీసుకువచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. నూతన చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు రైతుల సమస్యలను పరిష్కరించి మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. రాబోయే రోజుల్లో చేవెళ్లలోనే జిల్లా గ్రంథాలయం ఏర్పాటు చేసేలా కృషి చేస్తానన్నారు. డిజిటల్ లైబ్రరీల ఏర్పాటుకు కృషి చేయాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్ దృష్టికి తీసుకెళ్లారు.

చేవెళ్ల నూతన ఏఎంసీ పాలకమండలి ప్రమాణ స్వీకారం

చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా మండలంలోని నాన్‌చేర్ గ్రామానికి చెందిన గడ్డమీది పెంటయ్య, వైస్ చైర్మన్‌గా చేవెళ్ల గ్రామానికి చెందిన బ్యాగరి రాములుతోపాటు మొత్తం 14 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారిని స్పీకర్, ఎమ్మెల్యే తదితరులు సన్మానించి అభినందించారు.

కార్యక్రమంలో చేవెళ్ల మాజీ జడ్పీటీసీ మాలతి, పార్టీ మండల అధ్యక్షులు, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శైలజ, చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాణిక్య రెడ్డి, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు సమత, నాయకులున్నారు.

న్యాయవాదులతో మాట్లాడుతున్న జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి

జిల్లాలో 17వేల పెండింగ్ కేసులు

- తాండూరులో సబ్‌కోర్టు ఏర్పాటుకు కృషి
- జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి

తాండూరు, అక్టోబర్ 19 : జిల్లాలో 17వేల వరకు వివిధ అంశాలకు సంబంధించిన కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం తాండూరులో నిర్మించిన అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. తాండూరు సబ్‌కోర్టు పెండింగ్‌లో ఉందని.. దీని కోసం స్థలం గుర్తించే పనిలో ఉన్నట్లు తెలిపారు. ఇక్కడ ప్రణాళికలు అన్ని సిద్ధం చేశాక హైకోర్టు దృష్టికి తీసుకువెళ్లి తాండూరు సబ్ కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. తాండూరులో మంజూరైన అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం ప్రారంభానికి సిద్ధమైందన్నారు. త్వరలో ప్రారంభిస్తామన్నారు. జిల్లాలో లోక్ అదాలత్ ద్వారా 3500 కేసులను రాజీ కుదర్చడం జరిగిందన్నారు. జిల్లాలోని న్యాయస్థానాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, తాండూరు న్యాయమూర్తి శివ లీల, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు ఉన్నారు.

కేసీఆర్‌ను విమర్శించే నైతిక హక్కు కసిరెడ్డికి లేదు

కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు, అక్టోబర్ 19 : రాజకీయ భిక్ష పెట్టిన కేసీఆర్‌ను విమర్శించే నైతిక హక్కు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి లేదని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ఆమనగల్లులో శనివారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొనుగోటి అర్జున్‌రావు, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు అనురాధ, మున్సిపాలిటీ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జైపాల్‌యాదవ్ మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ రెండుసార్లు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించి, పార్టీలో ఎమ్మెల్యేతో సమానంగా అవకాశాలు కల్పించి, అభివృద్ధి పనులకు నిధులిచ్చి గౌరవిస్తే కల్వకుర్తి బీఆర్ఎస్ పార్టీలో గ్రూపు రాజకీయాలు చేసి బీఆర్ఎస్ పార్టీని బలహీనపరిచిన వ్యక్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు మోసం చేయడం వల్లే జిల్లాలో ఎమ్మెల్యేందరూ ఓడిపోయారని అనడం సరైంది కాదన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం ముఖ్యమంత్రిగా కేసీఆర్ రావడంతో ఉమ్మడి జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులకు మోక్షం కలిగిందన్నారు. పెండింగ్ ప్రాజెక్టులకు రూ.5వేల కోట్లు కేటాయించి 20 లక్షల ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. కల్వకుర్తి డీ-82 కాల్వ నిర్మాణంలో భూములు కోల్పోయిన భూ నిర్వాసితుల పరిహారం రూ.16 కోట్లు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే విడుదలైనప్పటికీ రంగారెడ్డి కలెక్టర్ నిర్లక్ష్యంతో రైతుల ఖాతాల్లో జమ కాలేదన్నారు.

రూ.5వేల కోట్లతో అభివృద్ధి పనులు

తాను మూడుసార్లు ఎమ్మెల్యేగా ఉన్న హయాంలోనే రూ.5వేల కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేశానని, రూ.1000 కోట్లతో రోడ్ల నిర్మాణం చేసిన ఘనత తనదేనని జైపాల్‌యాదవ్ అన్నారు. 12లక్షల30వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే దృఢ సంకల్పంతో మాజీ సీఎం కేసీఆర్ 35 వేల కోట్లతో హైలెవల్ టన్నెల్స్, 5 రిజర్వాయర్లు, కాలువల నిర్మాణం చేపట్టారని.. మరో 10వేల కోట్లు ఖర్చు చేస్తే ప్రాజెక్టు పూర్తవుతుందని.. ఇంత చేసిన కేసీఆర్‌ను పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు ఏ పనీ చేయలేదనడం సరైంది కాదన్నారు. ఎవరి ప్రయోజనాల కోసం ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్ మార్చారని.. దీని వెనుక మతలబు ప్రజలకు తేటతెల్లమైందని పేర్కొన్నారు. మార్చిన దక్షిణ భాగం అలైన్‌మెంట్ వల్ల పేద రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయకుండా మళ్లీ హైడ్రా పేరుతో సాధారణ ప్రజల ఇండ్లపైకి బుల్డోజర్లు పెట్టి కూల్చడానికి అధికారం ఎవరిచ్చారని ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకపడ్డారు. మూసీ సుందరీకరణకు కేవలం రూ.50వేల కోట్లు చాలునని సీఎం రేవంత్‌రెడ్డి గతంలో అన్నాడని.. ఇటీవల రూ.1.50 లక్షల కోట్లు అంటున్నాడని.. తెలంగాణ ప్రజలను దోచుకోవడానికే ఇలా చేస్తున్నాడని ఆయన దుయ్యబట్టారు.

పెండింగ్‌లో రూ.45వేల కోట్లు

రాష్ట్రవ్యాప్తంగా గత ప్రజాప్రతినిధులు చేసిన పనులకు చేసిన ఖర్చు రూ.45వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని.. ఓ ఉన్నతాధికారి ఓ ఆఫీసు పెట్టి 9 శాతం కమిషన్ మొదటగా ఇస్తేనే పెండింగ్ డబ్బులను విడుదల చేస్తున్నారని, ఇలాంటి పరిస్థితి గతంలో ఎప్పుడూ లేదన్నారు. తన రాజకీయ జీవితంలో ఎక్కడా అవినీతికి పాల్పడలేదని, తాను అవినీతి చేసినట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని 10వేల మందితో ఆమనగల్లులో త్వరలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమానికి మాజీ మంత్రి కేటీఆర్ రానున్నట్లు జైపాల్‌యాదవ్ చెప్పారు. సమావేశంలో బీఆర్ఎస్ మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్‌గౌడ్, ఏఎంసీ మాజీ డైరెక్టర్లు, సీనియర్ నాయకులున్నారు.



పసుమాములలో షెడ్డును కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

అక్రమ నిర్మాణాల కూల్చివేత

పెద్దఅంబర్‌పేట, అక్టోబర్ 19 : ప్రభుత్వ స్థలాల్లో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై అబ్దుల్లాపూర్‌మెట్ మండల రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. శనివారం మున్సిపాలిటీ పరిధి తట్టిఖానాలోని సర్వే నం.26లో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను, పసుమాముల రెవెన్యూలోని సర్వే నం.422లో చేపడుతున్న షెడ్డు నిర్మాణాన్ని కూల్చివేశారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే సహించేది లేదని తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ నిజాముద్దీన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో న్యాయ నిర్ణేతలు

జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు ప్రారంభం

వికారాబాద్, అక్టోబర్ 19 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు శనివారం జిల్లా విద్యాధికారి రేణుకాదేవి ప్రారంభించారు. ఈ పోటీల్లో ఆయా పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు పాల్గొని వారి ప్రతిభను చాటారు. 6 అంశాలపై ఈ పోటీలను నిర్వహించారు. నృత్యం(క్లాసికల్-ట్రెడిషనల్), సంగీతం, ఏకపాత్రాభినయం, చిత్రలేఖనం, నాటిక, కథలు చెప్పడం అనే అంశాలపై జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో రేణుకాదేవి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఈ పోటీలు దోహదపడుతాయని తెలిపారు. దేశ సమైక్యతను, సత్ప్రవర్తనను పెంపొందించడంతోపాటు కళల పట్ల విద్యార్థులకు ఉన్న అభిరుచిని గుర్తించడం జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో సైతం ఆయా అంశాలపై జరిగే పోటీల్లో ఈ ప్రాంత విద్యార్థులు ప్రతిభను చాటి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎంవో రామ్మస్తాన్, న్యాయ నిర్ణేతలున్నారు.

అధిక సాంద్రత పద్ధతితో పంటలో లాభాలు

కేంద్రీయ పత్తి పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త అమృత

బోడకొండలో అధిక సాంద్రత పద్ధతిలో సాగుచేసిన పత్తిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మంచాల, అక్టోబర్ 19 : అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయడం వల్ల కూలీల ఖర్చు తగ్గడంతోపాటు అధిక దిగుబడులు సాధించవచ్చునని కేంద్రీయ పత్తి పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త అమృత అన్నారు. శనివారం మంచాల మండలం బోడకొండ, చిత్తాపూర్ గ్రామాల్లో కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా సంస్థ, హైదరాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అధిక సాంద్రత పత్తి సాగులో భాగంగా క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమృత మాట్లాడుతూ.. శాస్త్రవేత్తల సలహాలు, సూచనల మేరకు రైతులు పత్తిని సాగుచేసుకొని అధిక లాభాలు పొందాలని సూచించారు. అధిక సాంద్రతతో పత్తి సాగు చేసుకున్న రైతుల వద్దకు వెళ్లి, వారి అభిప్రాయాలు తెలుసుకొని వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా.సుధీర్, డా.దిలీప్, ఏఈవో లింగస్వామి పాల్గొన్నారు.

అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్‌తో రైల్వే స్టేషన్లకు మహర్దశ

- వికారాబాద్ రైల్వేస్టేషన్‌కు రూ.24.35 కోట్లు
- తాండూరు రైల్వేస్టేషన్‌కు 24.40 కోట్లు

వికారాబాద్, అక్టోబర్ 19 : అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్‌లో భాగంగా వికారాబాద్, తాండూరు రైల్వేస్టేషన్లకు మహర్దశ పట్టనుంది. ఇందులో భాగంగా రైల్వేస్టేషన్ల ఆధునీకరణ పనులను భారత రైల్వేశాఖ చేపడుతున్నది. అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద రైల్వే ప్రయాణికులకు ఆధునిక సౌకర్యాలను అందించేందుకు తెలంగాణవ్యాప్తంగా ఉన్న 38 రైల్వేస్టేషన్‌లలో ఏకంగా రూ.1830.4 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపడుతున్నది. ఇందులో భాగంగా వికారాబాద్ రైల్వేస్టేషన్‌కు రూ.24.35 కోట్లు, తాండూరు రైల్వేస్టేషన్‌కు రూ.24.40 కోట్లు కేటాయించినట్లు రైల్వే శాఖ అధికారులు తెలిపారు. ఈ స్టేషన్లు శాటిలైట్ టెర్మినల్స్‌గా అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రధాని నరేంద్రమోదీ గత ఏడాది ఆగస్టు, ఈ ఏడాది ఫిబ్రవరిలో తెలంగాణ రాష్ట్రంలో స్టేషన్ల పునరాభివృద్ధికి శంకుస్థాపన చేయడంతో ఈ పథకానికి సంబంధించిన పనులు జోరందుకున్నాయి. ఈ పథకం కింద స్టేషన్ భవనాల పునరాభివృద్ధి, చక్కగా డిజైన్ చేయబడిన ఆధునిక ప్రయాణికుల సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

నోటీసులు అందుకుంటున్న శిల్ప అరణ్య వెంచర్ నిర్వాహకుడు

వెంచర్‌కు నోటీసులు

వికారాబాద్, అక్టోబర్ 19 : ప్రభుత్వ భూమిలోంచి అనుమతులు లేకుండా రోడ్డు వేసిన ఓ వెంచర్‌కు తహసీల్దార్ శనివారం నోటీసులు జారీ చేశారు. వికారాబాద్ మండల పరిధిలోని కొటాలగూడ గ్రామ సమీపంలో శిల్ప అరణ్య వెంచర్‌కు ప్రభుత్వ భూమిలోంచి అనుమతులు లేకుండా రోడ్డు వేశారు. గ్రామస్తులు, పత్రికల్లో వచ్చిన సమాచారంతో వెంచర్‌ను ఆర్ఐ నరేశ్ సందర్శించారు. అనుమతి పత్రాలు లేనందున, దాదాపు కిలోమీటర్ మేర ప్రభుత్వ భూమిలో రోడ్డు వేయడంతో నోటీసులు జారీ చేశామన్నారు. ఈ వెంచర్‌కు గతంలో సైతం మూడుసార్లు రోడ్డు వేసినందుకు అధికారులు తవ్వి ధ్వంసం చేశారని గుర్తు చేశారు. 10, 15 రోజుల తరువాత అధికారుల ఆదేశాల మేరకు అనుమతులు లేకపోతే వెంచర్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పతకాలు సాధించేందుకు మాస్టర్స్ కృషి చేయాలి

రంగారెడ్డి జిల్లా నుంచి అధిక సంఖ్యలో క్రీడాకారులు పతకాలను సాధించి సత్తా చాటాలని మాస్టర్ అథ్లెట్స్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొండా విజయ్‌కుమార్ అన్నారు. మాస్టర్ అథ్లెటిక్ జిల్లా రంగారెడ్డి క్రీడాకారుల ఎంపిక నవంబర్ 24వ తేదీన పీజేఆర్ స్టేడియంలో నిర్వహించనున్న నేపథ్యంలో శనివారం చందానగర్‌లోని హుడా కాలనీలో మాస్టర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరిలో జిల్లాస్థాయిలో నిర్వహించే పోటీలో జిల్లా నుంచి పాల్గొనే మాస్టర్స్ అధిక సంఖ్యలో పతకాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. సెలక్షన్స్ అనంతరం ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నూనె సురేందర్, ట్రెజరర్ స్వాతి ఉన్నారు.

- మాదాపూర్, అక్టోబర్ 19

అలరించిన నృత్య ప్రదర్శనలు

నృత్యంతో అలరించిన కళాకారులు

మాదాపూర్, అక్టోబర్ 19 : కళాకారులు నృత్య ప్రదర్శనలతో అలరించారు. అన్నమాచార్య భావనా వాహినిలో శనివారం పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు ఆధ్వర్యంలో అన్న